
# లిఫ్ట్

కాకాని కమల



రాత్రి సమయం పది గంటలు దాటుతోంది.

ఆకాశం నల్లగా మబ్బుపట్టి చల్లగా గాలులు వీస్తున్నాయ్. ఇప్పుడో ఇంకో ఘడియకో పెద్ద వాన కురవచ్చు. వుండి వుండి "ఛమక్...."మని మెరుపులు మెరిసి మాయం అవుతున్నాయ్.

"అబిడ్స్" సెంటర్‌లోంచి వేగంగా స్కూటరుమీద వస్తున్నాడు మూర్తి. వర్షం రాకుండా తొందరగా ఇంటికి వెళ్ళాలన్నదే అతని తాపత్రయం.

మూర్తి ఒక పెద్ద ప్రవైటుఫర్మ్‌లో పని చేస్తున్నాడు. ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకి కంపెనీ తరఫున ఒక పోష్‌హోటల్‌లో వి.ఇ.పి.స్‌కి కాన్ఫరెన్సు జరిగింది ఆ తరువాత డిన్నర్ కూడా వాళ్ళే అరెంజ్ చేశారు. ఆ ఫార్మాలిటీస్ అన్ని ముగించి బయట పడేసరికి ఆ సమయం అయ్యింది.

సినిమాలన్ని ఒదిలేసినట్లున్నారు.

అబిడ్స్‌లో షాపులన్ని కూడా చాలావరకూ మూసేశారు.

ఒకటి అరాగా మిగిలిఉన్న షాపులు కూడా షటర్సు దించి మూసే ప్రయత్నాల్లో వున్నారు.

రోడ్డుమీద జన సంచారం కూడా అంతగా లేదు

మూర్తి అబిడ్ సర్కిల్ దాటి "ఫరీన్" సినిమా హాలు మీదుగా సందు మలుపు తిరుగుతూ వుండగా హఠాత్తుగా అతని చేతులు హేండిల్‌బార్ మీదుగా కదిలి బ్రేకులు మీదకి వచ్చి గట్టిగా బిగుసుకున్నాయ్.

అంతే!

"కీచుఁ ...."మని శబ్దం చేస్తూ స్కూటర్ షడన్ బ్రేకుతో ఫుట్‌ఫాత్ వారగా ఆగిపోయింది.

కారణం-లేత వయసులో వున్న ఒక యువతి దాదాపు స్కూటరుకి అడ్డం పడుతున్నట్లుగ బస్సు స్టాపులోంచి రోడ్డు మీదకి వచ్చి కుడి చేతిని వేగంగా అటు-ఇటు కదుపుతూ స్కూటర్ని ఆపమన్నట్లు సైగలు చేసింది.

అంతే. అప్రయత్నంగానే మూర్తి రోడ్డు వారగా స్కూటర్ని ఆపు చేశాడు.

మూర్తి ఆ యువతికి దగ్గరగా వచ్చి స్కూటర్ని ఆపి కించిత్ ఆశ్చర్యంగా ఆమె మొఖంలోకి చూశాడు.

రెండు జడలతో తెల్లటి శరీర ఛాయతో లేత గులాబి రంగు చీరెలో.... లేత వయసులో అందంగా నాజూకుగా వుంది.

ఆమె భోజనానికి నల్లని హ్యాండ్‌బ్యాగ్ వ్రేలాడుతోంది. అసలే అందంగా వున్న ఆమె ఆ మెర్క్యురీ దీపాల కాంతిలో మరింత అందంగా వుంది.

మూర్తి కళ్ళు విప్పార్చి ఆశ్చర్యంగా ఆమె మొఖంలోకి చూడటం గమనించి ఆమె కొంచెం తడబడినట్లయి చిన్నగా సిగ్గుపడి ఆ తరువాత చక్కని ఇంగ్లీషులో చెప్పింది.

"తాను ఫరీన్ థియేటర్‌లో మొదటి ఆట సినిమా చూడటానికి ఫ్రెండ్సుతో కల్సి వచ్చానని. అయితే వాళ్ళ నెంబరు బస్సులు రావటంతో ఫ్రెండ్సు వెళ్ళిపొయ్యారని. కాని తను ఎక్కవలసిన నెంబరు బస్సు మాత్రం గంట నుంచి వేచి వున్న రాలేదని, రాత్రిళ్ళు ఆటోలో ఒంటరిగా వెళ్ళటం తనకి భయమని చెప్పి, అభ్యంతరం లేకపోతే కోటీ సెంటర్ దాకా తనకి లిఫ్ట్ "కావాలని" ఎంతో మర్యాదగా మూర్తిని "రిక్వెస్ట్" చేసింది.

తాను వెళ్ళేది కూడా ఆ రూటు మీదుగానే కావటంతో మరో ఆలోచన లేకుండా వెంటనే సంతోషంగా "విత్ ప్లెజర్! నో అబ్జక్షన్స్ ఎటాల్...." అంటూ తన అంగీకారాన్ని తెలియ చేశాడు.

ఆమె "థాంక్యూ వెరీమచ్ సర్" అంటూ చిరునవ్వుతో వచ్చి అతని వెనకాల పిలియన్ సీటు మీద సుతారంగా కూర్చుంది. ఫుట్ రెస్ట్‌మీద పాదాలు పెట్టుకుంది.

"బంతీ-చామంతీ ముద్దాడు కున్నాయిలే...." సంతోషంగా మనసులోంచి ఈలపాట వస్తుంటే బలవంతాన అణచుకున్నాడు మూర్తి.

ఆమె కూర్చుని "ఓ. కె.!" సర్" అనగానే మరు నిమిషం స్కూటర్ వేగాన్ని అందుకుంది.

సరిగ్గా అదేక్షణంలో వాన తుంపర మొదలయ్యింది. దాంతో స్కూటర్ మరింత స్పీడు పెంచాడు. మధ్యలో సందుల్లో రెండు సార్లు స్పీడు బ్రేకర్సు వస్తే వేగాన్ని ఏమాత్రం ఆపకుండా-- వాటిపై నుంచి "జంప్" చేసినట్లు చిన్న "జర్క్" ఇచ్చింది స్కూటరు.

ఆ కుదుపుకి-దానికి తోడు పైన పడుతున్న వర్షానికి ఆమె కొంచెం ఒణికినట్లయి చప్పున తన తామరతూడు లాంటి- అందమైన చేతిని అతని నడుం చుట్టూ బిగించి అతని వీపు మీదకి ఒరిగినట్లు జరిగి కూర్చుంది. అతని వేగానికి భయపడి పడిపోతానేమో! అన్న బెదురుతో అతని నడుంమీద బిగించిన చేతిని తియ్యలేదు.

"సారీసర్" అని మాత్రం చిన్నగా అంది.

"నెవ్వరు మైండ్" అన్నాడు ఆనందంలో తబ్బిబ్బు అవుతూ.

మెత్తగా ఆమె శరీరం వీపుని తాకుతుంటే గిలిగింతలు పెడుతున్నట్లు అతనిలో ఏవేవో అనుభూతులు.... చిలిపి కోర్కెలు......

మళ్ళీ-"బంతీ చామంతీ" అని పాడబోయి నాలిక్కరుచుకున్నాడు. వర్షం సన్నగా కురుస్తూనే వుంది! స్కూటర్ దానిమానన అది వేగంగా పోతూనే వుంది!అతనికి ఈ అనుభూతి చాలా కొత్తగా గిలిగింతగా వుంది.

చాలా సంవత్సరాలుగ సిటీలో స్కూటర్ నడుపుతున్నా ఇంతవరకూ ఏ అమ్మాయికి ఇలా లిఫ్టు ఇవ్వటం జరగలేదు. (అతనికి ఆ సరదా కోర్కె బలంగా వున్న అంత అదృష్టం కలగలేదు)కాని ఈ రోజు ఆ అవకాశం అయాచితంగా లభించినందుకు మనసులోనే ఆనంద పడ్డాడు.మళ్ళీ అంతలోనే హఠాత్తుగా అతనికి "కొలీగ్" రాజేష్ చెప్పిన ఒక చిన్న ఇన్సిడెంటు మెరుపులా జ్ఞాపకం వచ్చింది.

రాత్రి పూట ఒకసారి ఇలాగే రాజేష్ హోటల్‌లో భోజనం ముగించుకుని స్కూటర్‌మీద రూమ్‌కి వెడుతుంటే ఒక అమ్మాయి స్కూటర్ ఆపి "లిఫ్ట్" అడిగిందట!

కాని తీరా సగం దూరానికి వచ్చాక ఆమె–"ఒక యాభై రూపాయలు ఇస్తే ఆ రాత్రికి అతనితో గడపుతానని, తాను కాల్ గరల్‌ని"– అని చెప్పిందిట!

అప్పటికి రాజేష్ ఇంకా బ్రహ్మచారి కావటంవల్ల, అడపా దడపా ఇలాంటి జల్సాలు చేస్తూ వుండే-వాడు కావటంచేత, మరో మాట లేకుండా ఆ అమ్మాయికి యాభై రూపాయలు ఇచ్చి ఆ రాత్రి తన గదికి తీసుకెళ్ళి తెల్లవారు ఝామునే పంపించేశాడుట!

ఆ అమ్మాయి కూడా చాలా తెల్లగా అందంగా హుషారుగా వుందని రాజేష్ చెప్పినపుడు మూర్తి మనసు నిశ్శబ్దంగా మూలిగింది.

ఇప్పుడు హఠాత్తుగా మూర్తికి ఆ విషయం జ్ఞాపకం వచ్చింది.

"కొంపదీసి ఈమె కూడా అలాంటి బాపతు కాదు కదా?" అనుకున్నాడు.

కాని వెంటనే ఇంటి దగ్గర తన కోసం ఎదురుచూసే భార్య, ఇద్దరు పిల్లలు జ్ఞాపకం రాగానే వుసూరు-మంటూ చిన్నగా నిట్టూర్చాడు. అయినా–

ఒహవేళ ఆమె అలాంటిదే అయితే తనని "ఆ విషయం" గురించి ఏమని అడుగుతుంది? ఎలా అడుగుతుంది? బహుశా రాజేష్‌కి తటస్థపడిన అమ్మాయి లాగే ఈమె "అలాంటి బాపతే" అయి-వుంటుంది.....

లేకపోతే వయసులో వున్న ఒంటరి ఆడది, ఇంత రాత్రిపూట ధైర్యంగా స్కూటర్ లిఫ్టు అడిగిందంటే.... పైగా తన నడుం చుట్టూ చెయ్యి తిప్పి అంటుకొని కూర్చుందంటే తప్పకుండా అలాంటిదే అయి వుంటుంది. లలలా..... లలలా.....

ఆ ఆనందంతో ఈసారి పైకి సన్నగా ఈల పాట పాడుతూ స్కూటర్ని మరింత వేగం పెంచాడు.

కాని అతని ఆనందం ఎంతో సేపు నిలవలేదు.

ఆమె చిన్నగా అతని భుజం మీద తట్టినట్లు చేతితో కొట్టి ఆపమని రిక్వెస్ట్ చెయ్యటంతో మూర్తి చప్పున ఆలోచన్లనుంచి తేరుకుని చుట్టూ కలియ చూశాడు.

అతను వూహల్లో పడి సరిగా గమనించనే లేదు. కాని కోటీ సెంటరు వచ్చేసింది.

సింబాలిజమ్

ఏ దేశంలో నైనా
బిచ్చగాళ్ళు
ధనిక స్వాములే
రాజ్యమేలుతున్నారని
చెప్పడానికి
నిదర్శనాలు!!

–"సింహం"

వానజల్లు కూడా తగ్గింది.

మూర్తి స్పీడు తగ్గించి ఫుట్‌పాత్ వారగా నెమ్మదిగా స్కూటర్ని ఆపాడు.

ఆమె చప్పున స్కూటర్ దిగి "థ్యాంక్యూ సర్! మీరు లిఫ్ట్ ఇయ్యకపోతే ఈ చీకట్లో ఈ వర్షంలో ఎంత ఇబ్బంది పడేదాన్ని. మీ మేలు జన్మలో మరిచిపోలేను సర్!" అంటూ చక్కని ఇంగ్లీషులో అతనికి కృతజ్ఞతలు చెప్పి మా ఇల్లు ఈ పక్క గల్లీలోనే సర్! ప్లీజ్ గివ్ మి లీవ్. గుడ్ నైట్" అంటూ చెప్పి సన్నని చిరునవ్వుతో మరో మాటకి అవకాశం లేకుండా ఫుట్‌పాత్ ఎక్కి ఎదురుగా వున్న గల్లీలోకి వెళ్ళిపోయింది.

ఆమె గురించి ఏమేమో వూహించుకున్న మూర్తికి ఆమె అలా వెళ్ళిపోవటంతో గొప్ప ఆశాభంగం కలిగినట్లు అయ్యింది.

కొద్ది క్షణాలు స్థంభించినట్లు ఏమీ తోచని వాడిలా అలాగే వుండి పొయ్యాడు.

ఆమె సందులో కన్ను మరుగు అయ్యేదాకాఅలా రెప్ప వెయ్యకుండా చూసి చిన్న నిట్టూర్పుతో తిరిగి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

టాంకులో పెట్రోలు తక్కువగా వుంది.

ఆరోజు ఉదయం ఆఫీసుకి వచ్చే ముందే పోయిద్దామనుకుని హడావుడిలో మర్చిపొయ్యాడు.

మళ్ళీ రేపు ఉదయం ఆఫీసుకి వచ్చే ముందు బండి మొండికేస్తే ఇబ్బంది అవుతుంది కదా?

పొయించేస్తే సరిపోతుంది" అనుకుంటూ అల-వాటుగా ప్రక్కనే వున్న ఎప్పుడూ వచ్చే పెట్రోల్ బంక్ వైపు స్కూటర్ పోనిచ్చాడు.

ఆ అమ్మాయి తన నుంచి సహాయం పొంది ముచ్చా ముచ్చట లేకుండా అలా వెళ్ళిపోవటంతో అతనికి గొప్ప ఆశాభంగం అయ్యింది. మనసంత ఒక విధమైన అశాంతిగా తయారయ్యింది.

"అయినా తప్పేదేముంది?" అనుకుంటూ విసుగ్గా పెట్రోల్ బంక్ ముందు స్కూటర్ దిగాడు. పాత కస్టమర్ మూర్తిని చూస్తూనే ఓనర్ రాఘవులు కుర్చీలోంచి లేచి "గుడ్ నైట్ సార్" అంటూ ఎదురు వచ్చి "ఒరేయ్ యాద్గిరీ" అంటూ బోయ్‌ని కేకేశాడు.

అప్పుడే వచ్చిన స్టాక్‌ని లోపల సర్దుతున్న యాదగిరి ఆ పని వదిలి వచ్చి స్కూటర్‌లో నాలుగు లీటర్ల పెట్రోల్ నింపాడు.

"ఏంటి సార్ ఇంత లేటయ్యింది?" అన్నాడు రాఘవులు చిన్నగా ఆవులించి చిటికె వేస్తూ.

"కంపెనీ మీటింగ్ అయిందయ్యా" అంటూ బిల్లు పే చెయ్యటానికి పాంటు బ్యాక్ జేబులోకి చెయ్యి పోనిచ్చిన మూర్తి మరుక్షణం తేలు కుట్టినట్లు "కెవ్వు"మంటూ చేతిని చురుగ్గా వెనక్కి లాక్కున్నాడు.

కారణం–

జేబులో పర్సు లేదు!?

"అమ్మా! ఆడది!" అనుకున్నాడు అప్రయత్నంగా గుండెలమీద చెయ్యి ఆన్చుకుంటూ. □

